# సాక్షి ఆదిలాబాద్

గురువారం : 11 : జూలై : 2024




**ప్రభం'జనం'** 8లో▸

ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనాభా పెరిగిపోతోంది. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

## నోడల్ అధికారులకు ఎంఈవో బాధ్యతలు అప్పగించాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని మండల నోడల్ అధికారులకు ఎంఈవో బాధ్యతలు అప్పగించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అ . ధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమా ండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.



గరిష్టం/కనిష్టం
33.0/25.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### 'రైతుబంధు' జమ చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కైలాస్‌నగర్: రైతుల అభిప్రాయ సేకరణ పేరిట కాలయాపన చేయకుండా రైతుబంధు సాయాన్ని పదెకరాల వరకు తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఔట్ గేట్ ఎదుట రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల కోడ్ సాకుగా చూపి దాట వేయకుండా రైతు రుణమాఫీ సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

### పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితా

- 128 మందికి తప్పనిసరి బదిలీ అయ్యే అవకాశం

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ శాఖలో పనిచేసే గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాను అధికారులు బుధవారం రాత్రి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 320 మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఇందులో 245 మంది నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. వీరిలో 40శాతం మాత్రమే బదిలీ చేయాలనే నిబంధనల మేరకు 128 మందిని అర్హులుగా గుర్తించారు. సంబంధిత సీనియారిటీ జాబితా సిద్ధం చేసిన అధికారులు కలెక్టర్ అనుమతితో కార్యాలయ నోటీస్‌బోర్డుపై పొందుపరిచారు. అలాగే సంబంధిత మండలాధికారులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం చేరవేశారు. ఆ జాబితా ప్రకారం సదరు పంచాయతీ కార్యదర్శులు మ్యానువల్ విధానంలో ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 12వ రకు ఆప్షన్లు అందించే అవకాశముంది. అనంతరం కౌన్సెలింగ్ ద్వారా వారి బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు.

### మెడికల్ అండ్ హెల్త్ వర్కర్ల నిరసన



నినాదాలు చేస్తున్న మెడికల్,హెల్త్‌వర్కర్లు

ఎదులాపురం: ఆల్ ఇండియా డిమాండ్స్‌డే పురస్కరించుకుని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల ఎదుట బుధవారం నిరసనలు చేపట్టారు. సెకండ్ ఏఎన్ఎం, అర్బన్ ఏఎన్ఎం, ఏఎన్ఎం, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు, 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్ఎం, అర్బన్, ఈసీ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆనంద బాయి, తులసి, ప్రశాంత్ దేశ్‌పాండే, కిరణ్, సురేందర్, శ్రీనివాస్, దేవుబాయ్, లక్ష్మి, పుష్ప, రమాదేవి, అన్నపూర్ణ, దత్తు, సునీత తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా..

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

బోథ్: ఆదిలాబాద్ జిల్లాను కేంద్ర నిధులతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని సొనాలలో పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆయనకు విజయోత్సవ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీని పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు జీవీ రమణ, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, తాంసి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజు, మాధవ్ రావు, రవీందర్, రాజేశ్వర్, సుభాష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# భట్టి వస్తున్నారు..





హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు

- ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు..
- గతంలో 'పీపుల్స్‌మార్చ్' ఇక్కడి నుంచే
- గిరిజన సమస్యలపై విక్రమార్కకు అవగాహన
- నేడు ఉట్నూర్‌కు మంత్రివర్గ ఉపసంఘం
- 'రైతు భరోసా' వర్క్‌షాప్‌నకు హాజరు
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా రైతులు

నాడు పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లాలో ప్రజలను కలిసినప్పుడు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదివాసీలు తమకు భూమి లేదని, నీళ్లు రావడం లేదని, ఇళ్లు లేవని, రేషన్‌కార్డులు

**ఆర్థికమంత్రిగా వరాలు కురిపించాలని..**

వస్తలేవని, ఉద్యోగాలు లేవని, ఇలా తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై ఆయన అప్పట్లో స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని చెప్పారు. అంతే కాకుండా పోడు భూముల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేలా తోడ్పాటు అందిస్తామని, అలాగే కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గత మార్చి 16న భట్టి పాదయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పిప్రి గ్రామంలో సభ నిర్వహించాలని భావించినప్పటికీ చివరిలో అది రద్దయింది.

సాక్షి,ఆదిలాబాద్: సరిగ్గా పదహారు నెలల క్రితం.. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో తన పాదయాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభించారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం వద్ద 2023 మార్చి 16న షురూ చేశారు. సుమారు నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో కొనసాగింది. పలు నియోజకవర్గాలను దాటుకుంటూ ఏప్రిల్ 13న మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో సత్యాగ్రహ సభ నిర్వహణతో ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర ముగిసింది. ఈ క్రమంలో ఆయా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఆయనను కలిసేందుకు ఆసక్తి చూపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు తగ్గట్లే మల్లు భట్టి విక్రమార్క 'వచ్చేది ప్రజా ప్రభుత్వమేనని, ఇందిరమ్మ రాజ్యంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని' ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ విషయం ఇప్పుడు ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. పాదయాత్ర అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా భట్టి కీలక బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాకను ఈ ప్రాంతవాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

**నేడు ఉట్నూర్‌లో రైతు భరోసాపై వర్క్‌షాప్..**

రాష్ట్రంలో రైతు భరోసా పథకం అమలుపై విధివిధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను సభ్యులుగా నియమించింది. వీరు ఉమ్మడి జిల్లా వారీగా వర్క్‌షాప్ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. బుధవారం తొలి సమావేశం ఖమ్మంలో చేపట్టారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఉట్నూర్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 10:20 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉట్నూర్ చేరుకుంటారు. 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు భరోసా పథకంపై కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న రైతు భరోసా వర్క్‌షాప్‌కు మంత్రివర్గ ఉపసంఘంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రైతులు పాల్గొనున్నారు. ఈ మేరకు కేబీ ప్రాంగణంలోని హెలిప్యాడ్, సమావేశ మందిరాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు పరిశీలించారు. వారి వెంట అదనపు ఎస్పీ సురేందర్‌రావు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ నాగేందర్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఇతర శాఖల అధికారులున్నారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు



మొక్క నాటుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

ఇంద్రవెల్లి: జీవకోటికి జీవనాధారమైన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణతో పాటు హర్కాపూర్ తండాలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఆర్డీవో సాయన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎఫ్ఆర్‌వో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

**బృహత్ ప్రకృతివనం ఏర్పాటుకు స్థల పరిశీలన**

ఇంద్రవెల్లి మండలం గైరపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించారు. నాలుగు ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని డీఆర్డీవో సాయన్నను ఆదేశించారు.

**విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి**

గుడిహత్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని తోషం జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, కంప్యూటర్ గది, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫాం, పుస్తకాలు ఇచ్చారా? బాగున్నాయా? అంటూ ఆరా తీశారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం గోపాల్‌సింగ్ తదితరులున్నారు.

## 'ఉపాధి'పై కేంద్రం దృష్టి

- త్వరలో జిల్లాకు ప్రత్యేక బృందాలు
- క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిపై అధ్యయనం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. గతేడాదితో పోల్చితే ఈ సారి సుమారు పది లక్షల పని దినాలు అదనంగా పెరిగిన నేపథ్యంలో వాటి ప్రగతిపై పరిశీలన చేపట్టనున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా మరో 13 జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉందని నిర్ధారించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం ప్రత్యేక బృందాలను జిల్లాకు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇవి జిల్లా పర్యటనకు ఎప్పుడైనా రావచ్చని, అందుకు సంబంధించి పనుల సమగ్ర సమాచారంతో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర యంత్రాంగం జిల్లా డీఆర్డీఏ అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించే వారిని ఆదేశించింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు ఉపాధి పనులకు సంబంధించిన సమస్త సమాచారంతో కూడిన వివరాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లుగా తెలుస్తోంది.

**గతేడాదితో పోల్చితే పది లక్షల పనిదినాలు అదనం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని 17 మండలాల్లో 2023-24 సంవత్సరానికి గాను మొత్తం 29 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. ఈ పనిదినాలు గతేడాదిపాటు కొనసాగగా.. ఈ సంవత్సరం మాత్రం గడిచిన మూడు నెలల్లోనే 39 లక్షల పనిదినాలు పూర్తవడం గమనార్హం. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే పది లక్షల పనిదినాలు అదనంగా పెరిగాయి. ఏడాది పాటు సాగిన పనుల కంటే మూడు నెలల్లోనే ఈ స్థాయిలో పనులు జరగడంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో వాస్తవంగా పనులు జరిగాయా.. కాకిలెక్కలేమైనా చూపించారా.. నిబంధనల మేరకే పనులు చేపట్టారా.. అనే వివరాలను పరిశీలించేందు కోసం ప్రత్యేక బృందాలను జిల్లాకు పంపించనున్నట్లుగా తెలుస్తోంది. త్వరలోనే జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందాలు ఉపాధి హామీ పనులు చేపట్టిన ప్రదేశాలు, కూలీల హాజరు, చెల్లించిన కూలీలకు సంబంధించిన రికార్డులు, కూలీలకు నగదు అందాయా, కేంద్రం నిర్దేశించిన పనులు చేపట్టారా లేక ఇతర పనులేమైనా చేశారా అనే వివరాలను అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక అందించనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఉపాధి రోజు వారీ కూలి రూ.300కు పెంచడం, వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయడంతోనే కూలీల సంఖ్య భారీగా పెరిగి ఉపాధి పనిదినాలు లక్ష్యానికి మించి జరిగినట్లుగా అధికారులు చెబుతున్నారు. త్వరలో చేపట్టనున్న క్షేత్రస్థాయి పర్యటనలతో ఉపాధి పనుల ప్రగతి ఏంటో స్పష్టమయ్యే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

## నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్

- వారం రోజులుగా పోలీసుల స్పెషల్‌డ్రైవ్
- ఇప్పటి వరకు 321 వాహనాలు స్వాధీనం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: నంబర్‌ప్లేట్ లేని వాహనదారులపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కూడళ్లలో తనిఖీలు నిర్వహించి నంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు. బుధవారం 50 నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించారు. వారం రోజులుగా పట్టణంలోని 321 వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఒరిజినల్ రిజిస్ట్రేషన్ కార్డు ఆధారంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. తరచూ కావాలని నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ప్రతీ వాహనానికి వెనుక, ముందు భాగంలో నంబర్ ప్లేట్ ఉండాలన్నారు. ఒక నంబర్‌కు బదులు మరో నంబర్ ఏర్పాటు చేసినట్లయితే వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## ప్రైవేటీకరణ నిలిపివేయాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నాలో అంగన్‌వాడీలు, ఆశాలు

కైలాస్‌నగర్: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కోరికల దినం పేరిట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన, పంచాయతీ, మున్సిపల్ వంటి వివిధ రంగాల కార్మికులతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దత్తాత్రి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా సాగించిన సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలుచేసేందుకు యత్నిస్తుందన్నారు. ఆ యత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నన్న, సుభద్ర, కళావతి, పంచశీల, లక్ష్మి , శోభ, లక్ష్మి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లు లేకపాయె..!

- బోథ్ మండలంలోని పిప్పల్‌ధరి పాఠశాలలో దాదాపు 20 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడు కూడా లేరు. ఇటీవల జరిగిన ప్రమోషన్ ప్రక్రియలో ఇక్కడ పని చేసే టీచర్‌కు పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో బోధించే వారు కరువయ్యారు. పక్క పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు.
- భీంపూర్ ఉన్నత పాఠశాలలో 138 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ 6నుంచి 10వ తరగతి వరకు విద్యా బోధన సాగుతోంది. కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. తెలుగు, హిందీ, జీవశాస్త్రం బోధించే వారే ఉన్నారు. మిగతా సబ్జెక్టులు బోధించేవారు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేని వైనం
- కుంటుపడుతున్న బోధన
- పదోన్నతులతో మరిన్ని ఖాళీలు
- డీఎస్సీ నియామకం వరకు సర్దుబాటుతోనేనా..?



| |
|---|
| జిల్లాలో మొత్తం ఉపాధ్యాయ పోస్టులు:3,004 |
| పని చేస్తున్న ఉపాధ్యాయులు: 2349 |
| ఖాళీలు: 655 |
| ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు:18 |
| ఏకోపాధ్యాయ పాఠశాలలు:85 |
| మూతబడులు:10 |

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉపాధ్యాయ నియామకాలు లేకపోవడంతో కొన్నేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాణ్యమైన విద్యాబోధన జరగడంలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడంతో అన్ని తరగతుల విద్యార్థులనుఒకేచోట కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న ఘటనలు ఉన్నాయి. దీంతో పాఠాలు అర్థం కాక విద్యార్థులు చదువుల్లో వెనుకబడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించినప్పటికీ ఇంకా నియామకాలు చేపట్టలేదు. నవంబర్ వరకు ప్రక్రియ కొనసాగే అవకాశం కనిపిస్తుంది. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులవుతోంది. ఇటీవల బదిలీ, పదోన్నతులతో తరగతులు సరిగ్గా జరగలేదు. అయితే ప్రభుత్వం డీఎస్సీ నియామకాల వరకు ఉపాధ్యాయుల సర్దుబాటా లేక రేషనలైజేషన్ చేపడుతుందా అనేది తేలడంలేదు.

**సర్దుబాటా.. రేషనలైజేషనా..**

ఇటీవల చేపట్టిన బదిలీ,పదోన్నతుల ప్రక్రియ ద్వారా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం వరకు టీచర్ల సర్దుబాటుతో సరిపెడతారా లేక రేషనలైజేషన్ చేస్తారా అనే విషయం విద్యాశాఖ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గత ఏడాది జిల్లాలో 138 మంది టీచర్లను అవసరం ఉన్న పాఠశాలకు సర్దుబాటు చేశారు. జిల్లాలో ఒక్క టీచర్ లేని పాఠశాలలు ప్రస్తుతం 18 ఉన్నాయి. వీటిలో 16 పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీలకు పదోన్నతి లభించింది. ఈ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారింది. బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటితో పాటు మరో 150 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడితో కొనసాగుతున్నాయి. ఆ టీచర్ సెలవు పెడితే బడికి సెలవు అనే పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా ఇటీవల 1,232 మంది టీచర్లకు బదిలీలు జరగగా 1,074 మందిని రిలీవ్ చేశారు. 158 మంది బదిలీ అయినప్పటికీ ఆ పాఠశాలల్లో బోధించేందుకు టీచర్లు లేకపోవడంతో వారిని రిలీవ్ చేయలేదు.

**కుంటుపడుతున్న విద్యా బోధన**

సర్కారు బడుల్లో సరిపడా టీచర్లు లేకపోవడంతో చదువులు కుంటుపడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన సర్వేలో పాఠశాల విద్యలో అత్యంత వెనుకబడిన జిల్లాగా ఆదిలాబాద్ ఉండడంతో తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ నియామకాలు చేపడితే గానీ పరిస్థితి గాడిలో పడే పరిస్థితి కానరావడం లేదు.

జిల్లాలో ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేరు. విద్యార్థులు ఉన్న చోట బోధించే ఉపాధ్యాయులు లేని పరిస్థితి. జిల్లాలో ప్రస్తుతం 655 ఖాళీలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో పీహెచ్ హెచ్ఎం పోస్టులు 16, అలాగే ఎస్జీటీ 356, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 250 వరకు ఖాళీలు

**వేధిస్తున్న ఖాళీలు..**

న్నాయి. ఇటీవల పదోన్నతుల ప్రక్రియతో ఉన్నత పాఠశాలల్లో ఎస్ఏల కొరత కొంత తీరింది. ముఖ్యంగా ఉర్దూ, మరాఠీ, హిందీ మీడియాల్లో బోధించే ఉపాధ్యాయులు లేరు. వీటిల నియామకాలు కూడా లేకపోవడంతో ఈ పాఠశాలల్లోని విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు.

**ఇబ్బందులు కలగకుండా చర్యలు**

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. టీచర్ల కొరత ఉన్న విషయం వాస్తవమే. సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – ప్రణీత, డీఈవో

## క్లుప్తంగా

### స్టార్టర్ బాక్స్‌లో పాము



బాక్సులో పాము

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన రాజేందర్ అనే రైతు బుధవారం తమ పంటచేనులో ఉన్న బోరు మోటారు వద్దకు వెళ్లి స్టార్టర్ బాక్సు తెరిచిచూడగా అందులో బారీ పాము కనిపించింది. ఒక్కసారిగా భయాందోళన చెందిన రైతు సమీపంలోని చేలల్లో పనిచేస్తున్న రైతులను పిలవడంతో వారు వచ్చి పామును బయటకు తీసి చంపేశారు. రైతులు స్టార్టర్ బాక్సు తెరిచే క్రమంలో ఒక సారి తట్టితీయాలని సూచిస్తున్నారు.

### గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కాతో పోలీసులు

ముధోల్: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో సాయినాథ్ దుకాణంలో అక్రమంగా నిలువ ఉంచిన గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. గుట్కా విలువ సుమారు 60వేలు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

### కార్గో ఏజెంట్ల కోసం దరఖాస్తులు

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ కార్గో మేనేజర్ ఎస్.సదాశివ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్గో లాజిస్టిక్స్ బుకింగ్ సెంటర్ కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రూ.5వేలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో అయితే రూ.వెయ్యి సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఏజెంట్లకు ప్రతీ బుకింగ్ పైన 12 శాతం కమీషన్, రిసీవింగ్ పార్సిల్స్ ఒక్కో దానిపైన రూ.10 హ్యాండ్లింగ్ చార్జెస్ ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఆదిలాబాద్ నేషనల్ సేల్స్ టీం లీడర్ కే.సాయన్నను 9154298553 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించనున్న టీజీపీఎస్సీ గ్రూప్–1 (మెయిన్స్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఉత్తీర్ణత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22 నుంచి హైదరాబాద్, ఖమ్మంలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 75 రోజుల పాటు అందించనున్న ఈ శిక్షణలో నెలకు రూ.5వేలు స్టైఫండ్ అందిస్తారని, ఇతర వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.






# ప్రభంజనం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విశాలమైన గృహాలు, భవంతుల్లో కుటుంబ సభ్యులు నివాసముండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోతున్నాయి. క్రమంగా పట్టణీకరణ పెరుగుతుండడంతో పట్టణాలు, నగరాల్లో ఇరుకు గదుల్లో, సరైన వసతులు లేని నివాసగృహాల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇక పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు చెప్పనక్కర్లేదు. దీనికంతటికీ కారణం నానాటికీ పెరుగుతున్న జనాభా. భూమిపై పరిమితంగా ఉన్న సహజ వనరులు వినియోగించుకుంటూ అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాకు ఆహారం నివాసం కల్పించుకోవడం కష్టతరమవుతోంది. దీనికి తోడు వ్యవసాయ భూములు సైతం నివాస సముదాయాలుగా మారుతున్నాయి. అటవీ విస్తీర్ణం కూడా క్రమంగా తగ్గుతోంది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరమవుతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికంతటికీ పరిష్కారమార్గం అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టడమే. 1987 జూలై 11న ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా జూలై 11న 'ప్రపంచ జనాభా దినోత్సవం' జరుపుకుంటున్నాం.

- మితిమీరితే అనర్థమే..
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా
- ఉమ్మడి జిల్లాలోనూ 30 లక్షలకు చేరువగా..
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి సంస్థ విడుదల చేసిన 2021 గణాంకాల ప్రకారం..

ఉమ్మడి జిల్లా వివరాలు

| జిల్లా | మొత్తం జనాభా | జిల్లా వైశాల్యం (చ.కి.మీ) | జనసాంద్రత (కి.మీ) |
|---|---|---|---|
| నిర్మల్ | 7,09,418 | 3,731.35 | 190 |
| ఆదిలాబాద్ | 7,08,972 | 3,971.31 | 179 |
| మంచిర్యాల | 8,07,037 | 3,908.04 | 207 |
| కుమురంభీం | 5,15,812 | 4,491.28 | 115 |

**మితిమీరితే ఏర్పడే సమస్యలు**

- జనాభా పెరుగుదలతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- అడవులు అంతరించిపోతాయి.
- జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. నిరుద్యోగం పెనుసమస్యగా పరిణమిస్తుంది.
- ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బంది పెడతాయి.
- భవిష్యత్ అవసరాలకు ఆటంకంగా మారుతుంది.
- జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి.

నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై..వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి. సహజ వనరుల్ని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం, నిరక్షరాస్యత, అవసరాలు తీరకపోవడం, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్నంగా అవగాహన కల్పించి స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారమవుతాం.

**ప్రభుత్వాలు ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా..**

జనాభా పెరుగుదల నియంత్రించాలని ప్రభుత్వాలు అనేక ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా సరైన ప్రతిస్పందన కనిపించడం లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జనాభా నియంత్రణ అనేది స్వీయ ఆచరణ నుండి రావాలని ఒక మతం, ఒక వర్గం నుండే కాకుండా అందరూ ఆచరణలో అమలు చేయాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు మానవ వనరులను పెంచుకుంటూపోతే ప్రపంచీకరణలో భాగంగా ఎక్కడైనా మనుగడ సాగించగలుగుతాడని.. ప్రభుత్వాలు, పాలకులు చేయాల్సింది మౌలిక సదుపాయాలు కల్పించడమేనని మరోవైపు వాదిస్తున్నారు.

**పెరుగుతున్న నిరుద్యోగం**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 లక్షలకు పైగా జనాభా ఉండగా ఇందులో 60 శాతానికిపైగా యువత, వయోజనులే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ చిన్న ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో విపరీతమైన పోటీ నెలకొంటోంది. ప్రైవేటు రంగంలోనూ విపరీతమైన పోటీ ఉంటోంది. చిన్నాచితకా ఉద్యోగాలకు కూడా వందల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై వేలసంఖ్యలో యువత గల్ఫ్ దేశాలకు పయన మవుతూ వలస కార్మికులుగా మారుతున్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం పెరుగుతున్న జనాభా అని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జనాభా పెరుగుదల వల్ల నివాస సముదాయాలు పెరిగిపోవడం రియల్ ఎస్టేట్ రంగం కూడా వ్యాప్తి చెందుతుంది. క్రమంగా అటవీ విస్తీర్ణం కూడా తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

**చదరపు కిలోమీటర్‌కు సగటున 175 మంది...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 16,101.98 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిఉండగా 2021 జనాభా లెక్కల ప్రకారం 27,41,239 మంది జనాభా ఉన్నారు. ఈ లెక్కన ఒక చదరపు కిలోమీటర్‌కు జనసాంద్రత 175 నమోదై ఉంది. నిర్మల్ జిల్లాలో 7,09,000, ఆదిలాబాద్ జిల్లాలో 7,08,000, మంచిర్యాల జిల్లాలో 8,07,000, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5,15,000కు పైగా జనాభా నివసిస్తున్నారు. మంచిర్యాల జిల్లా అత్యధికంగా ఒక చదరపు కిలోమీటర్‌కు 207, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యల్పంగా 115 మంది జనసాంద్రతను కలిగి ఉన్నాయి.

### నియంత్రణ అవసరం



పరిమిత వనరులున్న మనదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు.. ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

### గల్ఫ్‌బాటలో యువత..



ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న జనాభా దృష్ట్యా నిరుద్యోగ రేటు కూడా పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 50 వేలకు పైగా మంది గల్ఫ్ దేశాల్లో కుటుంబాలకు దూరంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇక్కడి మానవ వనరులను సరైన విధంగా వినియోగించుకునే మార్గాలను మన ప్రభుత్వాలు అన్వేషిస్తేనే వలసలు ఆగుతాయి.– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ సంఘాల నాయకుడు, నిర్మల్

### బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య



మీసాల రాజన్న మృతదేహం

కుభీర్: బావిలోపడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హల్దా గ్రామానికి చెందిన మీసాల రాజన్న (75) భార్య గతేడాది మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం వడ్లపనికి అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతకగా పాడుబడిన బావివద్ద చెప్పులు, కంటి అద్దాలు కనిపించాయి. బుధవారం మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతుని కుమార్తె రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**మందమర్రిలో మరొకరు..**

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన రాంటెంకి శ్రీకాంత్ (24) బుధవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నాలుగేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన మౌనికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాదికే భార్య మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపా రు.

### పురుగుల మందు తాగి మహిళ...

కుభీర్: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు జామ్‌గాం గ్రామానికి చెందిన గంట నాగమణి (22)కి నాలుగేళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఏడాది కాలంగా జామ్‌గాంలో ఉన్న పుట్టింట్లో ఉంటోంది. మృతురాలి తల్లిని తండ్రి గతంలో వదిలివేసి మరో పెండ్లి చేసుకున్నాడు. తండ్రి ముత్యన్న పండరీపురం యాత్రకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం కుభీర్‌కు వచ్చి ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి కిందపడిపోవడంతో చికిత్స నిమిత్తం భైంసాకు తరలిస్తుండగా మృతి చెందింది. ఈ విషయమై ఎస్సై పి.రవీందర్‌ను అడగగా దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గోదాంలో బుధవారం పోలీసులు తనిఖీ నిర్వహించి పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. బెల్లూరి గ్రామ శివారు ప్రాంతంలోని గోదాంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో గోదాంలో తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం లభించినట్లు తెలిపారు. ముత్నూర్ మండలానికి చెందిన గణేశ్‌తో పాటు మరి కొంతమంది వ్యక్తులకు సంబంధించినవిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమాచారం అందించగా బియ్యాన్ని తూకం చేశారు. సుమారు 15 టన్నుల వరకు ఉంటాయని పోలీసులు అంచనా వేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఏఎస్సై జుల్ఫేకర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో

నార్నూర్: ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జీసీడీవో ఛాయా అన్నారు. బుధవారం నార్నూర్, మాన్కాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. తరగతి గదులకు వెళ్లి వివిధ పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డార్మెంటరీల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకుని భోజనం చేయాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, ఈ మూడునెలలు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, వార్డెన్ పవార్ వనిత, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల కోసం రోగుల పడిగాపులు



ఖాళీగా వైద్యురాలి కుర్చీ



వైద్యురాలి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

నర్సాపూర్(జి): ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పల్లెల్లో అధునాతన ఆస్పత్రి భవనాలు నిర్మించినా రెగ్యులర్ డాక్టర్లను నియమించకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వచ్చే డాక్టర్లు సమయపాలన పాటించకపోవడంతో గర్భిణులు, రోగులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటలు దాటినా గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్ రాకపోవడంతో గర్భిణులు, చిన్నారులు, రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై హెడ్ నర్స్‌ను వివరణ కోరగా ఇద్దరు వైద్యులు సెలవు పెట్టారని 11.30కి సమాధానం చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రిలో రెగ్యులర్ డాక్టర్లను నియమించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### అనుమానాస్పదంగా ఒకరి మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లిలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎల్కపల్లికి చెందిన తెలిగె రాజన్న (42)కు ఇరవై ఏళ్ల క్రితం దహెగాం మండలంలోని ఐనం గ్రామానికి చెందిన మంగతో వివాహమైంది. కుటుంబ కలహాలతో పదిహేనేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా మృతుడు ఇంటి నుంచి బయటికి రాకపోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలుపులు తెరచి చూడగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించింది. మృతుని కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య పేర్కొన్నారు.

### కలప సామగ్రి పట్టివేత



పట్టుబడిన వాహనం, సామగ్రి

కడెం: మండలంలోని పాండ్వపూర్ సమీపంలో అక్రమంగా కలప సామగ్రి తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. మండలంలోని గంగాపూర్ నుంచి సోఫాసెట్‌ను బొలెరో వాహనంలో దస్తురాబాద్ వైపు తరలిస్తుండగా సమాచారం మేరకు అటవీ సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన సామగ్రి విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని, కేసు దర్యాప్తులో ఉందని ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

### భైంసాలో విజిలెన్స్ బృందం తనిఖీ

భైంసాటౌన్: భైంసా పట్టణంలో విజిలెన్స్ బృందం అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 39 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ అచ్చేశ్వర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి... స్థానిక భైంసా–నిర్మల్ రోడ్డు పక్కన పార్డి(బి) బైపాస్‌రోడ్ కూడలి వద్ద ఓ దుకాణంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ బృందం దాడి చేసి పట్టుకున్నారు. ముందుగా అధికారులు దుకాణం వద్దకు చేరుకోగా తాళం వేసి ఉండడంతో పగులగొట్టి షటర్ తొలగించారు. అక్రమంగా బియ్యం సంచులు నిల్వ ఉంచడంతో ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కుభీర్‌కు చెందిన సాయినాథ్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హన్మాండ్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, ప్రశాంత్, దినేశ్‌చంద్ర ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగులపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో సంద్ర ధర్మయ్య (42)అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అందుగులపేటకు చెందిన ధర్మయ్య పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది.

**మృతదేహాన్ని ఢీకొట్టి..**

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బత్తుల శ్రీకాంత్ రోడ్డుపై పడి ఉన్న ధర్మయ్య మృతదేహా న్ని ఢీకొట్టి కిందపడడంతో గాయాలయ్యా యి. వెంటనే క్షతగాత్రున్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## రాథోడ్ రమేశ్ ఆశయాలను నెరవేరుద్దాం



నివాళులర్పిస్తున్న బంజారా నాయకులు

ఇంద్రవెల్లి: ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లా అభివృద్ధికి కృషి చేసి ఆకాల మరణం పొందిన రాథోడ్ రమేశ్ ఆశయాలను సాధించడానికి బంజారా నాయకులు, యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని బంజారా సంఘం నాయకులు రాథోడ్ రాంచందర్, జాదవ్ లఖన్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వర్గీయ రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంజారా యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సంజీవ్‌నాయక్, రాథోడ్ రాధిక, జాదవ్ రాధాబాయి, చవాన్ ఉత్తం నాయక్, రాథోడ్ అమోల్‌నాయక్, పవార్ మనోజ్, రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం



పంచనామా చేస్తున్న ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన కోల శరత్‌కుమార్ (33)కు పది నెలల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషుల మధ్య విడాకులు తీసుకున్నాడు. తరచూ పంచాయితీలు జరగడం, తల్లిదండ్రులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని



చికిత్స పొందుతున్న విద్యార్థిని

నస్పూర్: హాస్టల్‌లో చేర్పించిన తండ్రి ఇంటికి తీసుకెళ్లలేదని, ఎలాగైనా ఇంటికి వెళ్లాలన్న ఆతృతలో ఓ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కిందికి దూకి గాయాలపాలైన సంఘటన నస్పూర్‌లో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఉంటున్న అల్వాల లక్ష్మణ్ కుమార్తె అక్షరను ఇటీవల నస్పూర్‌లోని కేజీబీవీలో ఆరోతరగతిలో జాయిన్ చేశారు. తండ్రి లక్ష్మణ్ మంగళవారం కూతుర్ని చూడడానికి హాస్టల్‌కు వెళ్లాడు. తనకు ఇంటిపై బెంగగా ఉందని, ఇంటికి తీసుకెళ్లమని కోరింది. ఇందుకు తండ్రి నిరాకరించాడు. దీంతో బుధవారం ఉదయం స్నానం చేసేందుకు వెళ్లి హాస్టల్ రెండవ అంతస్తు నుండి దూకి బయటకు వెళ్లే ప్రయత్నం చేసింది. గమనించిన హాస్టల్ సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని వెన్నుముకకు గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

### బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

దండేపల్లి: మండల కేంద్రంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన ఎడ్ల శంకరయ్య (74)కు గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య రాంపూర్ గ్రామానికి చెందిన రాకేష్‌తో కలిసి మంగళవారం పని నిమిత్తం బైక్‌పై లక్సెట్టిపేటకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా తాళ్లపేట పీహెచ్‌సీ సమీపంలో బైక్‌కు అడ్డువచ్చిన పందిని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. శంకరయ్య తలకు బలమైన గాయం కావడంతో 108లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### చోరీ కేసులో ఏడాది జైలు

నెన్నెల: చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష రూ.200 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముఖేష్ బుధవారం తీర్పునిచ్చారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. 2022 జులై 7న మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ సాయిబాబా ఆలయంలోని హుండీ ఎత్తుకెళ్లి నగదు దోచుకున్నాడని పూజారి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు కోర్టులో సాక్షాదారాలు ప్రవేశపెట్టగా అదనపు పీపీ అజయ్‌కుమార్ వాదించి నేరనిరూపన చేయడంతో ఈమేరకు శిక్ష ఖరారు చేశారని ఎస్సై వివరించారు.